

# మీసమున్న మొగాళ్లకో సలామ్

'పంచపాండవులంటే నాకు తెలియదా మంచంకోళ్ల వలే ముగ్గురూ అని రెండు వేళ్లు చూపించినాడంట ఎనకటికొక సుంట. వాడన్నా దయదలిచి పంచపాండవులకి రెండు వేళ్లు చూపించినాడు. మీరు రెండుకి బదులు ఒకటి చూపించబోయి ఒకటి చూపించా లంటే ఎన్ని వేళ్లు ఎత్తాల్నో తెలియక సున్నా చూపిస్తార్రా రౌండుగా. అంతమాత్రపు సుంట లురా మీరు. సుంటల్లారా... సుంటల్లారా'.... కుమారస్వామి ఐవోరు రేగిపోతా ఉన్నాడు.

పాపం మా ఎస్‌కె గౌస్‌బాషాగాడు, ఎ. చెన్నక్రిష్ణయ్యగాడు పొద్దున లేచి ఎవురి మొకం చూసినారోగానీ యియ్యాల ఫుల్లుగా తింటా ఉన్నారు తిట్లు.

తిట్టీ తిట్టీ ఆయన ఆపితే గదా...

'మీరే కాదురా ఇంకా చాలా మంది ఉన్నార్రా ఈ కిలాసులో. కోస్తే రెండూర్లకి సరిపో తారుగానీ ఏమి లాబంరా. మీ మొద్దుచెర్మాలని ఎవురు తింటార్రా? వొండింది వొండిన ట్టుగా బయట పారేయాల్సిందేరా... సుంటల్లారా సుంటల్లారా'... ఐవోరికి బిపి పెరిగి పోతా ఉంది.

కానీ మనం ఏమి చెయ్యగలం? ఇది ఆయనక్కై ఆయనే తెచ్చుకున్న బీపీ.

సి సెక్షను పిలకాయలకి ఇంగిలీషు రావడం లేదు, గ్రామరులో అయితే పూర్తిగా సున్నాగా ఉన్నారు, రేపు యీళ్లు పెరిగి పెద్దయ్యి లండను గిండను పొయ్యి తప్పుల తడికెలతో మాట్లాడితే ఎవరికి చెడ్డపేరు? నాకే గదా అనుకొని మా చేత వర్కుబుక్కు పని మొదలుబెట్టించినాడు.

తెరవంగానే చుక్కలు చుక్కలుగా డాషులు డాషులుగా ఖాళీలుఖాళీలుగా అసయంగా ఉండే ఆ వర్కుబుక్కులో మా మొకాలు మేము చూసుకోగలముగానీ పెన్ను ఎత్తి ఏదైనా రాయగలమా?

కానీ మా షేక్ గౌస్‌బాషగాడు, ఏ.చెన్నక్రిష్ణయ్యగాడు ఒక అడుగు ముందరకేసి వాళ్లకు వచ్చిన మాడల్లో వర్కుబుక్కుని ఫిలపు చేసినారు.

'హి వెంట్ దేర్.. అండ్ నాట్ రిటర్న్డ్ బ్యాక్.. బికాజ్ అతడికి కుదరలేదు'... ఇదీ వాళ్లు రాసిన మాట.

'అతడికి కుదరలేదు'ను ఇంగిలీషులో 'atadiki kudara ledu' అని నీటుగా తప్పులు లేకుండా రాసిపెట్టినారు.

కుమారస్వామి ఐవోరు దానిని చూసి ఏందోలే అనుకొని బెంచీ దాటేసి వెళ్లిపోయినాడుగానీ మళ్లా డౌటొచ్చి చూస్తే ఏముందీ...

'బికాజ్ అతడికి కుదరలేదు'...

దాంతో కోపం రేగిపోయి 'పంచపాండవులంటే నాకు తెలియదా' అంటా మొదలుబెట్టినాడు. అది మా కుమారస్వామి ఐవోరికి ఫేవరేటు తిట్టు. దాన్ని ఎత్తుకున్నాడంటే మినిమము గెంటన్నా తిడతాడు.

'సార్... మీరట్టా తిట్టబాకండి సార్. ఇందులో మా తప్పేమీ లేదు సార్' అన్నాడు చెన్నక్రిష్ణయ్యగాడు తిట్టింది వినీ వినీ యింక బరించలేనట్టుగా పౌరుషంతో.

కుమారస్వామి ఐవోరు ఆగిపోయినాడు.

'మరి నా తప్పా?' అన్నాడు కళ్లు పెద్దంగా చేస్తా.

'మీ తప్పు కూడా కాదు సార్. ఒకసారి మాకు హిందీ ఐవోరు పాటం చెప్తా– ఒరే మీకొచ్చిన హిందీ అంతంతమాత్రం. అర్దాలు గుర్తుంటే మాటలు గుర్తుండవు. మాటలు గుర్తుంటే అర్దాలు గుర్తుండవు. మీకు పరీక్షల్లో హిందీ మాటలు గుర్తుకు రాకపోతే పెద్దగా బయపడబాకండి. ఆ హిందీ మాటలకు బదులుగా తెలుగుమాటలనే కరెక్టుగా హిందీ అక్షరాల్లో రాసెయ్యండి. 'కితాబ్' అని గుర్తుకు రాకపోతే 'పుస్తక్' అని రాసెయ్యండి. 'నవల'కి 'ఉపన్యాస్' అని గుర్తుకు రాకపోతే 'నవల్' అని రాసెయ్యండి ఒకటెయ్యకపోయినా అర మార్కున్నా ఏస్తారు అని చెప్పినాడు సార్. ఆ మాడల్‌లోనే యిక్కడ కూడా 'అతడికి కుదరలేదు'ను ఇంగిలీషులో ఎట్టరాయాలో తెలియక ఇంగిలీషు అక్షరాల్లో తెలుగులో రాసినాము సార్. 'రక్తం'కి 'ఖూన్' అని గుర్తుకురాకపోతే 'రక్త్' అని రాస్తాము గదా సార్. ఇది కూడా అంతేసార్. మా తెలివికి మెచ్చుకోవాల్సింది పోయి మీరు తిడతారేంది సార్' అన్నాడు వాడు.

మామూలుగా మా కుమారస్వామి ఐవోరు కిలాసు రూములో కూచోడు. కూచుని పాటం చెప్పేవాళ్లంటే ఆయనకు బలే మంట. కిలాసురూముల్లోని కుర్చీలన్నింటినీ తీసి బయటపడేస్తే ఐవోర్లు నిద్దర్లు పోకుండా పాటాలు బాగా చెప్తారని అంటా ఉండేవాడు.

అట్టాంటి మనిషి, లైపులో ఫస్టుటైము, మా చెన్నక్రిష్ణయ్యగాడు కొట్టిన 'రక్త్' దెబ్బకి కళ్లు తిరిగిపోయి కుర్చీలో కూలబడిపోయినాడు చాలా సేపు.

కూచొని కూచొని తలకాయ పైకెత్తి 'ఒరే... సినిమాయాక్టరు నాగబూషణంది మన ఊరేరా. రక్తకన్నీరు డ్రామా ఆడతా ఉంటాడు ఆయన. ఆ నాటకం చూడక రక్తకన్నీరు అంటే ఏందోలే అనుకుంటా ఉండేవాడిని. ఇయ్యాల నాకు తెలిసిందిరా. రక్తకన్నీరు అంటే అదేందో కాదురా. ఇప్పుడు నాకొచ్చేదేరా' అన్నాడు కర్చీపు తీసి బూజర బూజరగా అయిపోయిన కళ్లద్దాలని తుడుచుకుంటా.

'ఏమి సార్... మేమైనా తప్పు పని చేసినామా సార్? మీరట్టా మాట్లాడితే మాకు బలే బాదగా ఉంది సార్' అన్నాడు గౌస్‌బాషాగాడు.

'బాదా? బాదపడాల్సింది మీరుగాదురా నేనురా. రోజూ అద్దాల్లో మొకాలు చూసుకుంటారు గదరా. కిలాసులో ఇంతమందికి మీసాలు రాకపోయినా మీ ఇద్దరికీ వచ్చినాయి గదరా నాకంటే దట్టంగా మీసాలు. ఆ మీసాల మర్యాద కాపాడటానికైనా కాసేపు చదవొచ్చుగదరా. గెడ్డం గీసుకునే టైమును పుస్తకాల మీద పెడితే ఈపాటికి మీరు ఆల్బర్టు ఐన్‌స్టీన్‌లు అయ్యుండేవాళ్లు గదరా' అన్నాడు కుమారస్వామి ఐవోరు.

'ట్రై చేస్తాము సార్' అన్నారు వాళ్లు.

'ట్రైకాదురా మీకిదేరా నా పనిష్మెంటు.. రేపటి నుంచి మీరు మీసాలు గెడ్డాలతో కిలాసుల్లోకి రావడానికి వీల్లేదు. నున్నంగా గొరుక్కొని రావలసిందే. అద్దాల్లో మీ మొండిమొకాలని చూసుకున్నప్పుడైనా పౌరుషం వచ్చి చదువుతారేమో చూస్తాను' అన్నాడు చూపుడువేలు ఆడిస్తా.

'సార్'.. అన్నారు యిద్దరూ.

'సారు లేదు గీరు లేదు.. దీని మీద హియరింగు లేదు' అన్నాడాయన.

'సార్.. మీరే యిట్టంటే ఎట్ట సార్? ఇప్పటికే మా మీసాల వల్ల మేము ఎన్నో అవస్తలు పడతా ఉన్నాము. కిలాసులో ఒక్కడు కూడా మాతో సరిగ్గా ఫ్రెండ్ షిప్పు చెయ్యడం లా. పైగా గలబా చేస్తా ఉన్నారు. వాళ్లతో ఒక పక్క ఏగతా ఉంటే యింకో పక్క మా ఇళ్ల కాడ గెడ్డం గీసుకునేదానికి బ్లేడ్లకు డబ్బులు యియ్యక సంపతా ఉన్నారు. 'మేము టెన్తు చదవతా ఉన్నాము' అని ఎవరితోనైనా అంటే మా మీసాల వంక చూసి 'ఇప్పటికి ఎన్నిసార్లు తప్పినారు' అని అడగతా ఉన్నారు. ఈ బాదలన్నీ ఏనాడైనా మీకు చెప్పుకున్నామా సార్? మమ్మల్ని అర్దం చేసుకోవాల్సింది పోయి మీరే ఎదురు గొరుగుడు మొదలుబెడితే ఎట్ట సార్. మీసాలు గొరుక్కొని వస్తే రేపట్నించి అందరూ కొత్త గలబా మొదలుబెడతారు సార్' అన్నారు కళ్లమ్మట నీళ్లు తెచ్చుకుంటా.

వాళ్ల యిది చూసి కుమారస్వామి ఐవోరు కూడా ఇది ఇదిగా అయిపోయినాడుగానీ అయినా సరే కరగక 'లేదురా. మీకు ఒన్ మంత్ టైము యిస్తా ఉన్నా. ఈ లోపల మీరు బెటరు అయినారో సరే సరి. లాకుంటే మీ మీసాలకి పనిష్మెంటు తప్పదురా' అనేసి వెళ్లిపోయినాడు.

అయన వెళ్లిపోయినాక అందరం వాళ్లిద్దరి చుట్టూ మూగినాం.

అప్పటి దాకా మేము ఒక రకం మనుషులం. మాకు రాని మీసాలు వాళ్లకి వచ్చినందుకు గౌస్‌బాషా, చెన్నక్రిష్ణయ్యలకు విరోదులం. కానీ ఎప్పుడైతే వాళ్లు మీసాల బాదలు చెప్పుకొని కళ్లమ్మట నీళ్లు పెట్టుకున్నారో అప్పుడే మా మనసులు మారిపోయినాయి.

'ఒరే... మీరిద్దరూ బాదపడకండిరా. కుమారస్వామి ఐవోరు పైకి అట్టా అంటాడుగానీ లోపల వెన్నరా. మీకు పనిష్మెంటు యియ్యడురా' అని ధైర్నం చెప్పినాడు ఒకడు.

'ఒకేళ యిచ్చినా మీకేమిరా బాద. మీసాలు తీసేస్తే అచ్చం హిందీ సినిమా యాక్టర్లలా ఉంటార్రా. హిందీ ఐవోరి కాడ హిందీ బాగా నేర్చుకున్నారంటే బొంబాయి పొయినా బతికెయ్యొచ్చురా' అన్నాను నేను.

వాళ్లు ఏమీ మాట్లాడలా. రోజూ గెడ్డాలు గీసుకొని, మీసాలు ట్రిమ్ము చేసుకొని వస్తానే ఉన్నారు కిలాసులకి. కుమారస్వామి ఐవోరి బెదిరింపులకి బయపడి కొత్తగా కష్టపడిందీలా. పడినా వాళ్ల బుర్రకి ఎక్కిందీలా.

నెలరోజులు తర్వాత కుమారస్వామి ఐవోరు టెస్టు చేస్తే వాళ్ల స్టాండర్డు అట్టానే ఉంది – 'బికాజ్ అతడికి కుదరలేదు'

అది చూసి కుమారస్వామి ఐవోరికి నిజంగానే బలే బాదగా అనిపించి 'ఏమిరా మీరిద్దరూ?... ఎట్ట బతకతార్రా అసలకి? నిజంగా నాకు బలే బాదగా ఉందిరా మిమ్మల్ని చూస్తా ఉంటే. రోజులు చూడండిరా ఎట్టా ఉన్నాయో. మహా మహా చదువులు చదివిన వాళ్లే ఉద్యోగాలు లేక లాటరీలు కొడతా ఉన్నార్రా. మీరు ఈ వాటాన ఉంటే రేపు పెళ్లాం బిడ్డల్ని ఎట్ట సాకతార్రా?' అన్నాడు వాళ్ల దగ్గరికొచ్చి నిలబడతా.

'సార్.. మీరా బయం పెట్టుకోబాకండి సార్.. మా కిలాసులో ఉన్న యిళ్లందరికంటే బాగా బతకతాము సార్' అన్నాడు చెన్నక్రిష్ణయ్యగాడు.

'ఎట్టరా?' అన్నాడు కుమారస్వామి ఐవోరు.

'నాకు ఆర్టు బాగా వచ్చు గద సార్. ఇప్పుడిప్పుడే గోడల మీద అక్షరాలు రాయడం కూడా నేర్చుకుంటా ఉన్నా. రేపు బోర్డులు రాసుకున్నా బతికిపోతాను సార్ నేను' అన్నాడు వాడు.

'సార్.. మా అన్నకి సైకిలుషాపు ఉంది సార్.. నాకు పంక్చర్లు వేసి ట్యూబులు మార్చడం అంతా వొచ్చు సార్. బ్యాంకిలో లోను తీసుకొని డజను సైకిళ్లు పెట్టుకున్నానంటే బాడిక్కి తిప్పుకుంటా రిపేర్లు చేసుకుంటా హాయిగా బతికిపోతాను సార్' అన్నాడు గౌస్‌బాషాగాడు.

కుమారస్వామి ఐవోరు నోరెళ్లబెట్టి చూస్తా ఉంటే 'ఒకటి గుర్తుపెట్టుకోండి సార్. రేపు వీళ్లంతా ఎంత పెద్ద చదువులు చదివి ఎంత పెద్ద పుడింగి గాళ్లైనా ఒకరి కింద పని చేస్తా అమ్మా అయ్యా అంటా దండాలు దస్కాలు పెట్టుకుంటా బతకతా ఉంటారు సార్. మాకేమి సార్ ఆ ఖర్మ. రాజాల్లాగా ఎప్పుడు కావాలంటే అప్పుడు పని చేసి ఎప్పుడు కావాలంటే అప్పుడు ఇళ్లకి పోయి పొణుకుంటాము సార్' అన్నారు యిద్దరూ.

అది విని యింక యీళ్లని బాగు చెయ్యడం తగిన పని కాదనుకొని వెళ్లిపోయినాడు కుమారస్వామి ఐవోరు.

కాలం ఊరికే ఉండక గిర్రున తిరిగింది.

మేమందరం పెరిగి పెద్దయ్యి డిగ్రీలు చేసి పీజీలు చేసి ఇంజనీరింగులు చేసి ఎవరో ఒకరి కింద ఉద్యోగాలకి చేరి ఏదో ఉన్నంతలో అయ్యా అమ్మా అంటా బతకతా ఉన్నాము.

కానీ చెన్నక్రిష్ణయ్యగాడు, గౌస్‌బాషాగాడు మాత్రం వాళ్లు చెప్పినట్టుగానే వాళ్ల బతుకు వాళ్లు దర్జాగా బతకతా ఉన్నారు.

చెన్నక్రిష్ణయ్యగాడు పెయింటర్‌గా ఉండి ఆ బోర్డులు ఈ బోర్డులు రాసి ఇప్పుడు సొంతంగా వాడే తయారు చేసి అమ్ముకునే సోడా, సుగంధల యూనిట్ ఒకటి పెట్టుకొని నడపతా ఉన్నాడు మా ఊళ్లో.

ఇంక గౌస్‌బాషాగాడు మా ఇశ్వోదయ గేటుకు ఆనుకొనే సైకిల్ షాపు పెట్టుకొని, సైకిళ్ల బాడిక్కి ఇచ్చుకుంటా, రిపేర్లు చేసుకుంటా, వచ్చేపోయ్యేవాళ్లని పలకరిస్తా మొన్న కావలికి పోయినప్పుడు మా ఇశ్వోదయ దాకా పోతే చప్పట్లు కొట్టి మరీ పిలిచి టీ తాపిచ్చి పంపిచ్చినాడు.

ఉన్న ఊరిలో సొంత బతుకు!

బికాజ్ వాళ్లకి కుదిరింది.

ఏం చేస్తాం. ప్రాప్తం.

■